మద్యం మత్తులో తల్లిని చంపిన తనయుడు?

బోనకల్లు, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ కొడుకు తల్లిని చంపిన ఘటన శనివారం రాత్రి బోనకల్లు మండలం బ్రాహ్మణపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తాటి కొండ పాపయ్య స్థానికంగా ఓ వేడుకకు హాజరై పూటుగా మద్యం తాగి ఇంటికొచ్చాడు. ఆ మత్తులో భార్యను కొడుతుండగా అతని తల్లి మార్తమ్మ(70) అడ్డుకోబోయింది. దీంతో వృద్ధురాలనే విచక్షణ మరిచి తన తల్లిని పాపయ్య బలంగా నెట్టడంతో గోడకు తగిలింది. ఆమె అక్కడికక్కడే చనిపోయిందని కాలనీ వాసులు చెప్పారని ఎస్సై మధుబాబు తెలిపారు. గ్రామస్థులు మాత్రం పాపయ్య ఉద్దేశపూర్వకంగా తల్లిని హతమార్చినట్టు ఆరోపిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మంచి ప్రయత్నంతో సమస్యకు పరిష్కారం: జిల్లా జడ్జి


ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: మంచి మనసుతో ప్రయత్నిస్తే పరిష్కారం లేని సమస్య అంటూ ఉండదని, ఆ పరిష్కారానికి సరైన వేదిక లోక్ అదాలతేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ అన్నారు. న్యాయ సేవాసదన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ప్రారంభించి మాట్లాడారు. కోర్టులో తీర్పు వస్తే ఓ పక్షం వాళ్లు గెలిచి మరో పక్షం వాళ్లు ఓడిపోతారని, కానీ లోక్ అదాలత్‌ల్లో కేసు పరిష్కారమైతే ఇరుపక్షాలు గెలుపొందినట్లేనని చెప్పారు. న్యాయాధికారులు కె. ఉమాదేవి, వి. అపర్ణ, డి. రాంప్రసాదరావు, ఎం. అర్చనాకుమారి, కె.వి. చంద్రశేఖర్ రావు, ఎం. కల్పన, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె. ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి చింతనిప్పు వెంకట్ తదితరులు పాల్గొన్నారు. 2017లో ఆటో ప్రమాదంలో ఓ మహిళా హోంగార్డు మృతిచెందిన కేసులో.. మృతురాలి కుమార్తెకు ఆటో యజమాని రూ. 2.50 లక్షలు చెల్లించాడు. బీమా లేకపోవడం వల్ల ఇరుపక్షాలు నష్టపోయారని జిల్లా జడ్జి వ్యాఖ్యానించారు. జిల్లావ్యాప్తంగా అదాలత్‌లో మొత్తం 10,820 కేసులు పరిష్కారమయ్యాయి. 91 మోటారు వాహన ప్రమాద కేసులు పరిష్కరించి బాధితులకు రూ. 4.52 కోట్ల నష్ట పరిహారం ఇప్పించారు. పలు బెంచ్‌లకు న్యాయమూర్తులు, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి, మేజిస్ట్రేట్లు అధ్యక్షత వహించి క్రిమినల్, బ్యాంక్ తదితర కేసులను పరిష్కరించారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి.రాజగోపాల్, చిత్రంలో అదనపు జిల్లా జడ్జి కె.ఉమాదేవి, బార్ ఉపాధ్యక్షుడు కె.ఉపేందర్‌రెడ్డి

గుండె గుప్పెడంత.. ఒత్తిడి ఉప్పెనంత!

నేడు ప్రపంచ హృదయ దినోత్సవం



ఖమ్మం వైద్య విభాగం, కొత్తగూడెం వైద్య విభాగం, న్యూస్‌టుడే

గుండె లయతప్పుతోంది. ముఖ్యంగా యువత, టీనేజర్లూ గుండెపోటుతో కుప్పకూలుతున్న ఘటనలు ఇటీవల ఉమ్మడి జిల్లాలో ఎక్కువయ్యాయి. ఇక దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిలో ఉత్పన్నమవుతున్న హృద్రోగాలతో సతమతం అవుతున్నట్టు వైద్య నిపుణులు చెబుతున్నారు. కరోనా అనంతర పరిణామాల తర్వాత చోటు చేసుకున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులు.. గుండె జబ్బులు పెరిగేందుకు కారణమవుతున్నాయి. వ్యాయామం, ఆరోగ్యం పట్ల కనీస శ్రద్ధ, ముందస్తు పరీక్షలు తప్పనిసరని వైద్యులు సూచిస్తున్నారు.

- కనీస వ్యాయామానికి మహిళల్లో 57%, పురుషుల్లో 43% మంది దూరంగా ఉంటున్నారు.
- అసలు శారీరక శ్రమ అనేది తెలియని యువత 31% శాతం పైగా ఉన్నారు.
- ఖమ్మం సర్వజన ఆసుపత్రి గుండె వైద్య నిపుణుల విభాగాన్ని 2021-2024 (ఇప్పటి వరకు) మధ్య 20,994 మంది సందర్శించారు. వీరితో కలిపి మొత్తం 2డీ ఎకో పరీక్షలను 28,374 మంది చేయించుకున్నారు.



నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. వర్క్‌ఫ్రం హోం చేస్తున్నాను. వృత్తిపరమైన ఒత్తిడి ఆరోగ్యంపై పడకుండా ఉండాలని సర్దార్ పటేల్ మైదానంలో రోజూ వాకింగ్ చేస్తా. బరువు నియంత్రణలో ఉంచడమే లక్ష్యం. గాడ్జెట్స్, యాప్ సాయంతో శారీరక శ్రమ అంచనా వేస్తా' అని ఖమ్మంకు చెందిన గిరి అన్నారు.

ఆదివారం ప్రత్యేకం

అంతా.. అరచేతుల్లోనే..

ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధచూపుతున్న వారు 'గుండె' లయను అదుపులో ఉంచుకునే సాంకేతికతలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ముఖ్యంగా తమ బరువును అదుపులో ఉంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. మై ఫిట్‌నెస్‌పాల్, హార్ట్‌వాచ్ (ఐఓఎస్), వియర్ ఓఎస్ బై గూగుల్, కార్డియో, కార్డియో హార్ట్ హెల్త్, ఫిట్‌బిట్, ఆపిల్ హెల్త్, ఖడ్ (గ్రెజ్ కంపానియన్, లైఫ్‌సమ్ వంటి యాప్‌లతో గుండె లయ, పల్స్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటున్నామని ఖమ్మం, కొత్తగూడెంకు చెందిన పలువురు యువకులు 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు. మరోవైపు.. హార్ట్‌రేట్ మానిటర్, ఫిట్‌నెస్ ట్రాకర్, పోర్టబుల్ ఈసీజీ, స్మార్ట్‌బెడ్ (గ్రెజ్, హార్ట్‌రేట్ మానిటర్), ఆక్సీ మీటర్లు, ధరించదగిన హోల్టర్ మానిటర్లు, స్లీప్ ట్రాకర్ల వినియోగంతో పాటు.. ఆన్‌లైన్ కొనుగోళ్లకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వైద్య రంగ వివిధ వేదికగా నిలుస్తోంది. వీటి డిమాండ్ పెరుగుతోంది. యాప్‌లు, ఉపకరణాల సాయంతో రక్తపోటు, బరువు, హృదయ స్పందన రేటును రికార్డు చేసుకోవడం, తేడా గమనిస్తే వైద్య నిపుణులను సంప్రదించడం జరుగుతోందని కొందరు నడకసాధకులు అభిప్రాయపడ్డారు.



సత్యప్రసాద్

గత ఏడేళ్లుగా నడక సాధన చేస్తున్నా మరో యువకుడు సత్యప్రసాద్ మాట్లాడుతూ.. 'గుండె పనితీరు దెబ్బతినకుండా ఉండేందుకు నిర్దిష్ట లక్ష్యంతో నడక సాధన చేస్తాను. ఈ సమయంలో స్మార్ట్ వాచ్ సాంకేతికత సద్వినియోగం చేసుకుంటాను' అని చెప్పారు.



ఖమ్మం ఆస్పత్రిలోని హృద్రోగ చికిత్సల విభాగం

25 ఏళ్లు దాటిన తర్వాత నుంచి విధిగా ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకుంటూ.. వైద్యుల సలహాలను పాటిస్తే గుండె లయ తప్పే అవకాశం తక్కువ. యుక్త వయస్సులో చాలామంది ఎక్కువ సమయం స్మార్ట్‌ఫోన్లపై గడుపుతున్నారు. సరైన నిద్రలేక గుండె జబ్బుల బారినపడుతున్నారు. కొవిడ్ తర్వాత మహిళల్లో కూడా హృద్రోగాలు పెరిగాయి. ఛాతీ నొప్పి, చెమటలు, ఎడమ భుజం, మోచేతులు, దవడ, మెడ భాగంలో అసౌకర్యంగా భరించలేని నొప్పిరావడం, శ్వాస తీసుకోలేకపోవడం, వాంతులు, తలనొప్పి చెమటలు పట్టడం వంటివి గుండెపోటు లక్షణాలు. ఇవి కన్పిస్తే వెంటనే వైద్యుల్ని సంప్రదించాలి. వ్యాయామం చేస్తూ, తరచూ పరీక్షలు చేసుకోవడం చాలా ముఖ్యం.

- డాక్టర్ సీతారాం, కార్డియాలజిస్ట్, ఖమ్మం

హృద్రోగ చికిత్సలు ఇలా.. (సెప్టెంబర్ 28వ తేదీ వరకు)

భద్రాద్రి / ఖమ్మం	కార్డియోథెరపిక్ సర్జరీ (భద్రాద్రి)	కార్డియోథెరపిక్ సర్జరీ (ఖమ్మం)	కార్డియాలజీ చికిత్సలు (భద్రాద్రి)	కార్డియాలజీ చికిత్సలు (ఖమ్మం)
2023	239	442	672	1211
2024	408	244	1063	685

పంచాయతీ ఓటర్లు.. @ 8,52,879

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: జిల్లాలోని 20 మండల పరిషత్‌ల పరిధిలో 589 గ్రామ పంచాయతీలు, 5,398 వార్డుల్లో శనివారం ఓటర్ల తుది జాబితాలను అధికారులు ప్రకటించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ మేరకు గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా తుది జాబితాలను వెల్లడించగా 8,52,879 మంది ఓటర్లు నమోదయ్యారు. వీరిలో మహిళలు 4,39,808, పురుషులు 4,13,048 థర్డ్ జెండర్స్ 23 మంది ఉన్నారు. ఖమ్మం రూరల్ మండలంలో అత్యధికంగా 78,554, వైరా మండలంలో అత్యల్పంగా 26,915 మంది ఓటర్లున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలను ఈనెల 13 తేదీన వెల్లడించారు. వాటిపై ఎంపీడీఓలకు 922 అభ్యంతరాలు అందగా.. అన్నింటినీ పరిష్కరించి తాజాగా తుది జాబితాను వెల్లడించారు.

మండలం	పురుషులు	మహిళలు
బోనకల్లు	17435	18455
చింతకాని	19687	21340
ఏన్కూరు	13,236	14340
కల్లూరు	26,176	27473
కామేపల్లి	17181	17779
ఖమ్మం రూరల్	37,728	40807
కొణిజర్ల	20,103	21176
కూసుమంచి	23,922	25528
మధిర	15,059	16084
ముదిగొండ	23,091	25026
నేలకొండపల్లి	23,525	25633
పెనుబల్లి	20,990	22086
రఘునాథపాలెం	19090	20954
సత్తుపల్లి	17,177	18329
సింగరేణి	21,925	22862
తల్లాడ	22,315	23336
తిరుమలాయపాలెం	24,075	25705
వేంసూరు	17964	18579
వైరా	13013	13909
ఎర్రుపాలెం	19356	20407

కూసుమంచిలో వంద పడకల ఆస్పత్రికి స్థల సేకరణ

కూసుమంచి, న్యూస్‌టుడే: కూసుమంచిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రిగా వ్యవహరిస్తున్న నియోజకవర్గ ప్రతినిధి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు చర్యలు తీసుకుంటున్నారు. స్థల సేకరణ కోసం ఇటీవల మంత్రి, అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ సురేష్‌కుమార్ కూసుమంచి నుంచి 2.5 కిలోమీటర్ల దూరంలో గంగబండతండా వద్ద సర్వే నంబర్ 12 లోని 5.10 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. ఈ స్థలాన్ని రెండు రోజుల్లో వైద్య, ఆరోగ్య శాఖకు బదిలీ చేయనున్నారు. తర్వాత ఆస్పత్రికి నిర్మాణానికి సంబంధించిన అనుమతుల ప్రక్రియ పుంజుకుంటుంది.

గ్రానైట్ యజమానుల సంఘం అధ్యక్షుడిగా యుగంధర్



యుగంధర్ | గోపాలరావు | పరమేశ్వరరెడ్డి

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ది ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పాటిబండ్ల యుగంధర్ 35 ఓట్ల మెజార్టీతో ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కమర్తపు గోపాలరావు 98, కోశాధికారిగా మారం రెడ్డి పరమేశ్వరరెడ్డి 58 ఓట్ల మెజార్టీతో ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శి-1గా షేక్ రియాజ్, ఈసీ మెంబర్-1, 4గా శ్వేధన్, పి. రవికుమార్ విజయం సాధించారు. ఖానాపురంలోని హరిత గార్డెన్స్‌లో శనివారం పోలింగ్ జరిగింది. ఎన్నికల అధికారిగా నేరెళ్ల శ్రీనివాసరావు వ్యవహరించారు. అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు రాయల నాగేశ్వరరావు, సాధు రమేశ్‌రెడ్డి నేతృత్వంలో యుగంధర్ ప్యానెల్ ఎన్నికల్లో విజయం సాధించింది. నూతన కమిటీ రెండేళ్ల పదవీ కాలంలో కొనసాగుతుంది.

ఫోన్ జోలికి వెళ్లొద్దు సారూ..

పాల్వంచ, న్యూస్‌టుడే



ఖమ్మం జిల్లాలో
పాఠశాలలు: 1,616
ఉపాధ్యాయులు: 4,562

పాఠశాల నిర్వహణ, తరగతుల బోధన సమయాల్లో ఉపాధ్యాయులు కొందరు ఫోన్లను వినియోగిస్తున్నారు. దీన్ని నియంత్రించాలని ప్రభుత్వం సంకల్పించింది. తరగతి గదుల్లోకి స్మార్ట్‌ఫోన్లు తీసుకెళ్లడాన్ని నిషేధించింది. ఇటీవల జిల్లా విద్యా శాఖాధికారులు ఉత్తర్వులను సైతం జారీచేశారు. అయినా అవి పలుచోట్ల బేఖాతరవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకున్న ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటుచేసుకుంది.

తరగతి గదుల్లోకి ఫోన్లను నిషేధిస్తూ విద్యాశాఖ ఆదేశాలు జారీచేసినా.. కొన్ని పాఠశాలల్లో అవి మోత మోగుతూనే ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. తరగతి గదికి వెళ్లేముందు తమ ఫోన్లను ప్రధానోపాధ్యాయులకు అప్పగించాల్సి ఉంది. ఇకనైనా పర్యవేక్షణను పటిష్ఠపరచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

★ 'విద్యాలయాల్లో ఫోన్ల వినియోగాన్ని నిషేధించినా కొందరు పెడచెవిన పెడుతున్నట్లు ఫిర్యాదులొస్తున్నాయి. ఇకపై నిర్లక్ష్యాన్ని సహించబోం. ప్రతి ఉపాధ్యాయుడు విధుల్లో ఫోన్ వినియోగానికి దూరంగా ఉండాలి. హెచ్‌ంలు ఫోన్లను తమ వద్దే పెట్టుకోవాలి'. - ఎం.వెంకటేశ్వరాచారి, డీఈవో, భద్రాద్రి కొత్తగూడెం

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కరకగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం శ్రీరంగాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చందులాల్‌ను సస్పెండ్ చేస్తూ డీఈవో వెంకటేశ్వరాచారి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. తరగతి గదిలో ఫోన్ మాట్లాడుతున్నారని సోషల్ మీడియాలో ఆరోపణలు రాగా డీఈవో విచారణ చేపట్టారు. అది నిజమేనని తేలింది. ఎంఈఓ మంజులను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఉపాధ్యాయుడు చందులాల్ ఫోన్ వాడడంతో డీఈఓ సస్పెండ్ చేశారని, ఈ మేరకు ఉత్తర్వులిచ్చారని తెలిపారు.

ఉద్యోగ మేళాకు 1,524 మంది హాజరు

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: ఉపాధి కల్పనశాఖ శనివారం ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా ఉద్యోగ మేళాలో 1,524 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. 18-40 ఏళ్లలోపు వారికి 18 కార్పొరేట్ సంస్థలు నియామకాలు కల్పించాయి. ముఖ్యఅతిథిగా వచ్చిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ.. ఇక్కడ వచ్చే ఉద్యోగం తొలిమెట్టు మాత్రమేనని, ఆ తర్వాత ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు ఆయన నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమాన్ని ఉపాధి ప్రాంతీయ అధికారి రవీందర్, జిల్లా అధికారి మాధవి పర్యవేక్షించారు. ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ జాకీరుల్లా, అధ్యాపకులు, ఎన్‌సీసీ కేడెట్లు తోడ్పాటు అందించారు.



నియామక పత్రాలు అందుకున్నవారితో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


విద్యుత్ శాఖలో బదిలీలు.. అర్హుల జాబితా సిద్ధం

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లాలో పలు డివిజన్లలో పని చేస్తున్న విద్యుత్ శాఖలోని ఉద్యోగుల బదిలీలకు అధికారులు రంగం సిద్ధం చేశారు. శనివారం రాత్రి అర్హుల జాబితా విడుదల చేశారు. ఒకేచోట రెండేళ్లకు మించి పని చేస్తున్నవారు బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. జిల్లాలోని ఐదు డివిజన్లలోని లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, జూనియర్ లైన్‌మెన్‌లు, ఫోర్‌మెన్‌లు, పరిపాలనా విభాగానికి చెందిన సీనియర్ అసిస్టెంట్, జేఏఓ, జూనియర్ అసిస్టెంట్ తదితర ఉద్యోగుల జాబితాను విడుదల చేశారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.







సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

గురువర్యా.. మీకిది తగునా?

కూసుమంచి, ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

తల్లిదండ్రుల తర్వాత ఆ స్థానంలో నిలిచి.. దైవ సమానంగా పూజలందుకునే కొందరు గురువుల ప్రవర్తన పవిత్ర వృత్తికి మచ్చతెస్తోంది. పిల్లలను విద్యాబుద్ధులతో సన్మార్గంలో నడిపించాల్సిన వారిలో కొందరు వక్రబుద్ధిని ప్రదర్శిస్తున్నారు. ఇలాంటి ఘటనలు ఉమ్మడి జిల్లాలో తరచూ ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉండటం బాధాకరం.

తాజాగా వైరా మండలంలో ఓ ప్రధానోపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవరించిన ఘటనపై కేసు నమోదైంది. ఇది ఉభయ జిల్లాల్లో తొలి ఘటనైతే కాదు. గతంలో పలు ఉదంతాల్లో సస్పెండ్‌కు గురైన సందర్భాలనేకం ఉన్నాయి..

☆ తిరుమలాయపాలెం మండలంలోని ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఒకరు గతంలో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ తల్లిదండ్రులకు చిక్కాడు. వారి చేతిలో దేహశుద్ధి చేయించుకుని చివరకు సస్పెండ్ అయ్యాడు. పలు ఘటనల్లోనూ ఆయన ప్రవర్తన వివాదాస్పదమైంది. సస్పెండ్ తర్వాత బుద్ధిమార్చుకోక పోగా.. తిరిగి విధుల్లో చేరాక కూడా ఓ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులంటూ విద్యార్థినుల పట్ల వక్రబుద్ధి ప్రదర్శించాడు. మళ్లీ ఆయనపై వేటుపడటం కొసమెరుపు.

☆ కూసుమంచి మండలంలోని ఓ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పదో తరగతి విద్యార్థినిని పొరుగు జిల్లా కేంద్రంలోని లాడ్జికి తీసుకెళ్లి అడ్డంగా దొరికిపోయాడు.

☆ ఇల్లెందులోని సింగరేణి ఎయిడెడ్ పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ ఘటనతో అధికారులు శాఖాపరమైన చర్యల్లో భాగంగా బదిలీ వేటు వేశారు.

☆ టేకులపల్లి మండలంలోని ఓ ఉన్నత పాఠశాలలో మరో టీచర్ పదో తరగతి విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు.

☆ కొణిజర్ల సమీపంలోని ఒక గురుకుల పాఠశాలలో కాంట్రాక్టు ఉపాధ్యాయుడు బాలికతో అసభ్యంగా వ్యవహరించాడు. దీంతో అధికారులు ఆయన్ను ఉద్యోగంలోంచి తొలగించారు.

☆ కొత్తగూడెం నియోజకవర్గ కేంద్రంలో ఓ ఆర్ట్ టీచర్‌పైనా కలెక్టర్ ఆదేశాలతో కొద్దిరోజుల క్రితం పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో ఆయన హెచ్.ఎం. అండతో విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు విచారణాధికారి విచారణలో తేలింది.



'విద్యార్థినులతో ఉపాధ్యాయుల అసభ్య ప్రవర్తన లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తాం. కొద్ది రోజుల్లో ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తాం. తొలుత ఉపాధ్యాయులకు, ఆ తర్వాత బాలబాలికలకు విడివిడిగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తాం. ప్రతీ పాఠశాలలో ఉపాధ్యాయినులతో కమిటీ ఏర్పాటుచేసి బాలికల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తాం. ఫిర్యాదుల పెట్టె ఏర్పాటుచేసి, రెండు రోజులకోసారి దాన్ని తెరిచేలా చూస్తాం.'

- సోమశేఖర్‌శర్మ, ఖమ్మం డీఈఓ.

'ప్రసాద్' పనులను సకాలంలో పూర్తి చేయండి

☆ టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డి

భద్రాచలం, ఖమ్మం క్రీడలు, పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రసాద్ పథకాన్ని నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. రెండేళ్ల కిందట రాష్ట్రపతి ద్రౌపదీముర్ము భద్రాచలం పర్యటనలో ప్రసాద్ పథకం పనులకు శంకుస్థాపన చేశారు. భద్రాచలం, పర్ణశాలలో కలిపి రూ.42 కోట్లతో పథకం పనులు కొనసాగుతున్నాయి. కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, రామాలయం ఈఓ రమాదేవి, ఆర్డీవో దామోదర్‌రావుతో కలిసి వీటిని ఎండీ శనివారం పరిశీలించారు. డిసెంబరుకల్లా పనులు పూర్తయితే కొత్త పనులకు నిధులు వచ్చే వీలుందని వెల్లడించారు. రామయ్యను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆదివాసీ కళా చిత్రాన్ని ఎండీకి కలెక్టర్ బహూకరించారు.

☆ ఖమ్మం ఖిల్లాపై ఏర్పాటు చేయనున్న రోప్ వేకు అవసరమైన అంశాలను పర్యాటక ఎండీ ప్రకాష్‌రెడ్డి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులతో కలిసి శనివారం పరిశలించారు. ఖాళీ ప్రదేశం నుంచి రోప్ వెళ్లేలా చూస్తున్నామని అధికారులు ఆయనకు వివరించారు.

☆ కిన్నెరసాని పర్యాటక కేంద్రం పరిధిలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అద్దాల మేడ, కాటేజీలు తదితర పనులను కలెక్టర్ ప్రకాశ్‌రెడ్డి పరిశీలించారు. డిసెంబరు 1 నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జలాశయంలో బోటుపై ఆయన విహరించారు.



టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డికి ఆదివాసీ కళా చిత్రాన్ని అందిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పక్కన పీఓ రాహుల్, ఈఓ రమాదేవి, ఆర్డీవో దామోదర్‌రావు

సహకార వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

☆ ప్రశాంతంగా డీసీసీబీ మహాజన సభ



వీవీపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదుబాబును సన్మానించిన డీసీసీబీ ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, పక్కనే డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తదితరులు

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అన్నారు. ఖమ్మంలోని డీసీసీబీ సమావేశం మందిరంలో శనివారం జరిగిన 125వ మహాజన సభలో మాట్లాడారు. మోటాపురం సొసైటీ అధ్యక్షుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ.. రుణమాఫీ ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని అన్నారు. సమగ్ర ఆడిట్ నివేదికను బయట పెట్టాలన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి సమావేశానికి ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. మంచుకొండ సహకార సంఘం అధ్యక్షుడు మందడపు సుధాకర్, పోచారం సొసైటీ అధ్యక్షుడు అంజయ్య, ఆంధ్రాబ్యాంకు కర్షక సేవా సమితి అధ్యక్షుడు బీరెడ్డి నాగచంద్రారెడ్డి రుణమాఫీ, పలు కీలక అంశాలు లేవనెత్తారు. డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా సహకార అధికారి జి.గంగాధర్, సీఈఓ వసంతరావు, మార్క్‌ఫెడ్ ఉమ్మడి జిల్లా మేనేజర్ సునిత, ఏడీఏ వాసవీరాణి, పాలకవర్గ సభ్యులు, సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ సొసైటీ అధ్యక్షులను బ్యాంకు ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు సన్మానించారు.

బాలురు.. గంజాయి తరలిస్తూ దొరికారు..!

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: సీలేరు డొంకరాయి నుంచి విజయవాడకు గంజాయి తరలిస్తున్న ఇద్దరు మైనర్లను పట్టణ పోలీసులు శనివారం పట్టుకున్నారు. వివరాల్లోకెళితే.. విజయవాడకు చిట్టినగర్‌కు చెందిన పదిహేడేళ్ల లోపు ఇద్దరు బాలురు చదువు బంద్ చేశారు. జల్సాలకు అలవాటుపడ్డారు. డబ్బు కోసం గంజాయి వ్యాపారానికి దిగారు. డొంకరాయిలో సరకు కొనుగోలు చేసి విజయవాడకు శనివారం స్కూటీపై బయల్దేరి వెళ్తుండగా.. పట్టణ అదనపు ఎస్సై రాఘవయ్య జీసీసీ ఎదురుగా చేపట్టిన తనిఖీల్లో వీరిని పట్టుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.3.50 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

ఐదు రోజుల్లో.. 57.21 కిలోలు..

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ఖమ్మం ఆబ్కారీ ఎన్‌ఫోర్సుమెంట్ బృందం వరుసగా ఐదు రోజుల్లో భద్రాచలం, పాల్వంచ, మణుగూరు ప్రాంతాల్లో దాడులు చేసి 57.21 కిలోల గంజాయి పట్టుకుంది. గత నాలుగు రోజుల్లో 14 మంది వద్ద 43.18 కిలోల గంజాయి దొరకగా.. శనివారం స్థానిక కూనవరం రోడ్‌లో ఐదుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్న మరో 14.03 కిలోల సరకు లభ్యమైంది. వారందరినీ పోలీసులు అరెస్టు చేశారు. దాడుల్లో సీఐ శ్రీనివాస్, కరీం, బాలు, భద్రాచలం సీఐ రహీమున్నిసాబేగం తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి అభివృద్ధికి సాంకేతిక తోడ్పాటు



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న సీడీబీ ఉప సంచాలకులు కుమార్‌వేల్

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: కొబ్బరి తోటల పెంపకంలో సాంకేతిక అంశాలకు కొబ్బరి అభివృద్ధి బోర్డు పూర్తి తోడ్పాటు అందిస్తుందని సీడీబీ ఉప సంచాలకులు కుమార్‌వేల్ పేర్కొన్నారు. కొబ్బరి బోర్డు- ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఆరు రోజుల పాటు కొబ్బరి వృక్ష మిత్రులకు నిర్వహించిన శిక్షణ శనివారం ముగిసింది. కుమార్‌వేల్ మాట్లాడుతూ గతేడాది కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా తెలంగాణకు ఈ ఏడాది రూ.65లక్షలు కేటాయించినట్లు తెలిపారు. వ్యవసాయ కళాశాల ఏడీ హేమంత్‌కుమార్, ఆచార్యులు శిరీష, ఐవీఎస్ రెడ్డి, గోపాలకృష్ణమూర్తి, సీడీబీ క్షేత్ర అధికారి సురేష్ పాల్గొన్నారు. అశ్వారావుపేట, గంగారం పరిసరాల్లోని కొబ్బరితోటలను కుమార్‌వేల్ సందర్శించారు.

ప్రధానోపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో సోమశేఖర్‌శర్మ

వైరా, న్యూస్‌టుడే: విద్యార్థుల పట్ల ప్రధానోపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడంటూ తల్లిదండ్రులు ఆందోళన చేసిన సంఘటన వైరా మండలం పాలడుగు ఉన్నత పాఠశాలలో శనివారం చోటుచేసుకుంది. హెచ్.ఎం. చావా శ్రీనివాసరావు కొందరు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, లైంగికంగా వేధిస్తున్నాడంటూ తల్లిదండ్రులు ధ్వజమెత్తారు. వారంతా పాఠశాలకు వస్తున్నంతలోనే సదరు హెచ్.ఎం. బయటికి వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు పాఠశాలకు చేరుకున్నాడు. ఆయన్ను, ఇతర ఉపాధ్యాయులను ఓ గదిలో నిర్బంధించిన బంధువులు అక్కడే బైఠాయించారు. దీంతో డీఈవో సోమశేఖర్‌శర్మ, వైరా సీఐ సాగర్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. తల్లిదండ్రులతో మాట్లాడారు. వారికి నచ్చజెప్పారు. విద్యార్థినుల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చావా శ్రీనివాసరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ఫొక్సో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. సదరు హెచ్.ఎం. గతంలో బోనకల్ మండలంలో పనిచేసే సమయంలో వివాదాస్పద నిర్ణయాలతో సస్పెన్షన్‌కు గురయ్యారు.

ఘనంగా రాములోరికి స్వర్ణ తులసీ దళార్చన


భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. బంగారు తులసి పూజలను ఘనంగా కొనసాగించారు. పసిడితో తయారుచేసిన తులసీ దళాలను సీతారాముడి పాదాల చెంత వద్ద ఉంచి అర్చన చేశారు. సీతమ్మకు యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీత ధారణ నిర్వహించారు. మాంగల్యధారణ రమణీయంగా నిలిచింది. తలంబ్రాల వేడుక అమితానందాన్ని అందించగా, దర్బారు సేవ తన్మయత్వాన్ని నింపింది. సర్వ ఏకాదశి సందర్భంగా లక్ష కుంకుమార్చన పూజ చేశారు. పవళింపు సేవ లేదు. ఆదివారం అభిషేకంతో పాటు బంగారు పుష్పార్చన ఉంటుందని తెలిపారు.

పంచాయతీ కార్మికుని ఆత్మహత్య



ములకలపల్లి, న్యూస్‌టుడే: పంచాయతీ కార్మికుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . అన్నారం గ్రామానికి చెందిన పొడియం నారాయణ(57) సీతారాంపురం పంచాయతీ కార్మికునిగా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం ఇంటికి సమీపంలోని పశువుల కొష్టం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాజశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. నారాయణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, పనిమానేస్తే కుటుంబపోషణకు ఇబ్బంది పడాల్సి వస్తుందని బాధపడేవాడిని మృతుని కుమారుడు రాజారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నారాయణ ఆత్మహత్యకు పనిఒత్తిడి, పంచాయతీ అధికారులే కారణమంటూ శనివారం స్థానిక వాట్సప్ గ్రూపులలో ప్రచారం సాగింది. మృతదేహం వద్ద పోలీసులు ఒక లేఖను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పనుల విషయమై అధికారులు ఒత్తిడికి గురిచేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారు బాధిత కుటుంబసభ్యులతో రాజీ ప్రయత్నాలు నెరిపినట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



వైరా, న్యూస్‌టుడే: వైరా మధిర రోడ్డుకు చెందిన చెరుకుమల్లి సీతయ్య(42) శనివారం ఉదయం తన ఇంటి ముందు నీళ్లు చల్లుతున్న క్రమంలో పక్కనే ఉన్న ఓ దుకాణానికి చెందిన బోర్డును పట్టుకున్నాడు. దీంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆయనకు సీపీఆర్ చేసి స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి స్వస్థలం కొణిజర్ల మండలం చిన్నమునగాల. దుకాణ యజమానిపై చర్యలు తీసుకోవాలని బంధువులు ఆందోళన చేశారు. వైరా ఎస్సై భాగ్యరాజు సంఘటన స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు.

అక్రమంగా తరలించిన బాణసంచా పట్టివేత

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణంలో భారీగా బాణసంచా అక్రమ నిల్వలను పట్టణ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. త్వరలో దీపావళి నేపథ్యంలో తమిళనాడు నుంచి లారీలో వచ్చిన సరకును భద్రాచలం ఇండస్ట్రియల్ ఏరియాలోని గోదాంలో దిగుమతి చేస్తుండగా.. పట్టణ సీఐ సంజీవరావు, పోలీసులు వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. బిల్లు ప్రకారం రూ. 8లక్షల విలువైన 80 కార్టన్ల సరకు ఉన్నట్లు సమాచారం. నలుగురు వ్యక్తులు కలిసి సరకును కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. బాణసంచాను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు సీఐ చెప్పారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

సత్తుపల్లి
•సత్తుపల్లి •మధిర •వైరా

రూ.2 లక్షల ముత్యాల కవచం బహూకరణ


అమ్మవారికి ముత్యాల కవచం అందిస్తున్న వెంకటశ్రీనివాసరావు దంపతులు

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. శ్రీవారికి తెల్లవారుజామున పంచామృతాలతో సర్వాంగాభిషేకం చేశారు. ప్రాంగణంలోని అలివేలు మంగా అమ్మవారికి విజయవాడకు చెందిన దాత శ్రీపప్పు వెంకటశ్రీనివాసరావు దంపతులు సుమారు రూ.2 లక్షల ముత్యాల కవచాన్ని తయారు చేయించి, ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, పర్యవేక్షకులు విజయకుమారికి అందించారు. దాతకు అర్చకులు శ్రీవారి ప్రసాదాలు అందించారు.

కొణిజర్లలో ఫ్లెక్సీ వివాదం

కొణిజర్ల, న్యూస్‌టుడే: కొణిజర్లలో కాంగ్రెస్ ఫ్లెక్సీని చింపేయడం వివాదాస్పదంగా మారింది. మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఫొటోలతో బస్వాపురం క్రాస్‌రోడ్డు వద్ద దసరా శుభాకాంక్షలతో కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చించారు. శనివారం స్టేషన్‌లో దీనిపై ఫిర్యాదు చేశారు. నాయకులు మోషా, ప్రసాద్, వెంకటేశ్వర్లు, సంసోన్, సుధాకర్, జయ రాజు, రామలక్ష్మయ్య, వెంకటరత్నం పాల్గొన్నారు.

సగమే సిబ్బంది.. అంతా ఇబ్బంది

◆ మూడు పురపాలకాల్లో పారిశుద్ధ్య కార్మికుల కొరత

మధిర, సత్తుపల్లి, వైరా, న్యూస్‌టుడే: శుభ్రంగా ఉండే రహదారులు.. వెలిగే వీధి దీపాలు.. పేరుకుపోని మురుగు కాల్వలు.. దోమలు విజృంభించని వాతావరణ పరిస్థితులు.. సగటు పుర పౌరుడు కోరుకునే కనీస సదుపాయాలు ఇవి. దురదృష్టవశాత్తు పురపాలకాల్లో ఈ సదుపాయాలే కరవయ్యాయి. జనాభాకనుగుణంగా ప్రభుత్వాలు ఆర్భాటంగా మున్సిపాలిటీలను ఏర్పాటు చేస్తూ వారిపై పన్నుల భారం మోపుతూ పోతున్నాయి. సదుపాయాలను మాత్రం 'కల్పన'గా మిగులుస్తున్నాయి. ప్రజారోగ్య జీవనానికి మూల స్తంభాలుగా నిలిచే పారిశుద్ధ్య కార్మికుల నియామకంలో పాలకులు శీతకన్ను వేస్తున్నారు. వైరా, సత్తుపల్లి, మధిర.. మూడుచోట్లా కార్మికుల కొరత తీవ్రంగా వేధిస్తుంది.

సత్తుపల్లి

● ప్రధాన రహదారితో పాటు దాన్ని ఆనుకున్న అంతర్గత రోడ్లు కొంతమేర శుభ్రంగా ఉంటున్నాయి.

●మున్సిపాలిటీలో విలీనమైన రాజీవ్‌నగర్‌లో పారిశుద్ధ్య పనులు అంతంతమాత్రం. డ్రైనేజీల్లో తీసిన చెత్తను వెంటనే తొలగించకపోవటంతో మళ్లీ అందులోకే చేరుతోంది.

●హనుమాన్ నగర్, ఎన్టీఆర్ నగర్, గుడిపాడు, వెంగళరావు నగర్, జంగాల కాలనీల్లో అధ్వాన పరిస్థితులున్నాయి. రోడ్ల వెంట పిచ్చిమొక్కలు పెరిగిపోతున్నాయి.

జనాభా - 50 వేలు
వార్డులు - 23
పనిచేస్తున్న కార్మికులు: 87
ఇంకా కావాల్సిన వారు: 53


జవహర్ నగర్ జంగాల కాలనీ శివారులో డ్రైనేజీ దుస్థితి

సమస్యలు ఇలా..

★ ప్రతి రోజూ చెత్త సేకరణ సాధ్యం కావడం లేదు. ఇళ్లలో చెత్తను బయట పోస్తుండటంతో కొన్ని వీధుల్లో గుట్టలుగా దర్శనమిస్తున్నాయి.

★ మురుగు కాల్వలో సిల్టు పేరుకపోయి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. వర్షాకాలంలో తరుణ వ్యాధులు విజృంభిస్తున్నాయి.

★ కొద్దిపాటి సిబ్బందిని వారంలో రెండు రోజులు ఏదో ఓ ప్రభుత్వ కార్యక్రమాల్లో వినియోగిస్తుండటంతో అసలు పనులకు ఆటంకం ఏర్పడుతుంది.

★ ఫాగింగ్, బ్లీచింగ్ చల్లటం, ఆయిల్ బాల్స్ వేయటం తూతూమంత్రంగా సాగుతున్నాయి.

★ సిబ్బంది కొరతతో దూరాభారం వెళ్లలేక సమీప ప్రాంతాల్లో చెత్తను డంప్ చేసి వస్తున్నారు. రోగాలను పెంచిపోషిస్తున్నారు.

మధిర

◆ ప్రధాన రహదారిని ఊడ్చటం, డివైడర్ల మధ్యలో మొక్కల నిర్వహణకే ఎక్కువ మంది సిబ్బంది పనిచేస్తున్నారు. అంతర్గత వీధులను వదిలేశారు.

◆ శివారు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పడకేసింది. మడుపల్లి గ్రామం, అన్నాయిపాలెం గ్రామాలు మధిరకు 7కి.మీ. దూరంలో ఉంటాయి. నెలకు ఒక్కసారైనా ఇక్కడ సపాయి కార్మికులు పనిచేస్తున్న దాఖలాలు లేవు. వీధిలైట్లు సరిగ్గా వెలగవు.

◆ జీలుగుమాడు, అంబారుపేట తదితర ప్రాంతాల్లో డ్రైన్లు పొంగిపొర్లుతున్నాయి.

◆ హనుమాన్ కాలనీ, ముస్లిం కాలనీలో ఇదే పరిస్థితి.

◆ 40 వేలు
◆ 22
◆ 75 మంది
◆ 37

◆ జనాభా ప్రాతిపదికన ప్రతి పదివేల మందికి 28మంది పారిశుద్ధ్య కార్మికులుండాలి. మూడు పురపాలకాల్లోనూ ఆ పరిస్థితి లేదు.


మధిర అంబేడ్కర్ సెంటర్‌లో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కార్మికులు

వైరా

➡ ప్రజాప్రతినిధులు పర్యటనప్పుడు మాత్రమే అంతర్గత రహదారుల్లో పారిశుద్ధ్య నిర్వహణ కనిపిస్తుంది. పట్టణంలో ఎక్కడా డ్రైనేజీ నిర్వహణ లేదు.

➡ బ్రాహ్మణపల్లి, మాటూరుపేట, ద్వారకానగర్, సంతబజార్, హనుమాన్ బజార్, శాంతినగర్ వంటి ప్రాంతాల దుస్థితి తెలియాలంటే వర్షాకాలంలో ఒక్కసారి పర్యటిస్తే చాలు.

➡ శివారు పల్లిపాడు, దుద్దిపూడి, లాలాపురంలో చెత్త సేకరణ, డ్రైనేజీ నిర్వహణ పూర్తిగా పడకేసింది.

◆ 35 వేలు
◆ 20
◆ 60 మంది
◆ 38

◆ కొంతమంది సిబ్బందిని వ్యక్తిగత పనులకు వినియోగించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.


వైరా: పూడిక తొలగిస్తున్న కార్మికుడు

'జనాభా ప్రాతిపదికన అదనపు కార్మికులు అవసరం. వీరి నియామకానికి సంబంధించి ఎలాంటి తీర్మానాలు చేయలేదు. ఉన్నవారితోనే ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. స్పెషల్ డ్రైవ్‌లో కొత్తవారిని నియమించుకుంటున్నాం.'

- కమిషనర్లు ఎం.రవిబాబు(సత్తుపల్లి), చింతా వేణు(వైరా), రేవతి (హెల్త్ అసిస్టెంట్ మధిర)

రాజీ మార్గమే రాజమార్గం: న్యాయమూర్తి


కక్షిదారులకు ప్రశంసాపత్రం అందిస్తున్న జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్

సత్తుపల్లి, న్యూస్‌టుడే: రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి ఎం.శ్రీనివాస్ అన్నారు. స్థానిక కోర్టు సముదాయాల ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ కక్షిదారులు అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొత్తం 231 కేసులను న్యాయమూర్తులు పరిష్కరించారు. రాజీ అయిన కక్షిదారులకు సీనియర్ సివిల్ జడ్జి ఎస్కే మీరాబాషాసాహెబ్(?), అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.లావణ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తేజావత్ అచ్చుతో(?) కలిసి న్యాయమూర్తి మొక్కలందించారు. ఏజీపీ జి.రామచంద్రారెడ్డి, సీఐ కిరణ్, ఏవో బోయినపల్లి రవి, ఎస్సైలు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాల పరిశీలన

సత్తుపల్లి, న్యూస్‌టుడే: రేజర్లబంజరు(?) సమీపంలో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాలను డీటీడీఓ ఆశాలత, డీఎల్‌వో రాంబాబు శనివారం పరిశీలించారు. భవన నిర్మాణ పనులతోపాటు గదుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చేనెల 2న కలెక్టర్ పాఠశాలను ప్రారంభించేలా చర్యలు చేపడుతుండటంతో పనులు మొత్తం పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శ్రమదానం చేశారు. ఎంపీడీఓ రమేశ్, ఎంపీఓ రవీంద్రప్రసాద్ పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీకాలనీ(?), న్యూస్‌టుడే: మధిర మండలం రాయపట్నం వాసి కొండయ్య(35) ఇద్దరు వ్యక్తులతో కలిసి శనివారం కూలికెళ్లేందుకు(?) వచ్చాడు. సాయంత్రం తర్వాత వెంట వచ్చిన వారికి అతను కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేదు. శనివారం ఉదయం కోర్టు సమీపంలోని ముళ్లకత్వ(?) చెరువు వద్ద పోలీసులు చెరువులో దిగి అతని మృతదేహాన్ని బయటకు తీశారు. బహిర్భూమికని వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

గల్లంతైన ఘటనలో మరొకరు..

వేంసూరు, న్యూస్‌టుడే: ఈ నెల 26న పశువులను మళ్లించే క్రమంలో కందుకూరు వద్ద తమ్మిలేరులో పడి కొట్టుకుపోయిన తుంగా రామారావు (50) ఏపీ ఏలూరు జిల్లా శివాపురం వద్ద విగత జీవిగా కనిపించాడు. రామారావుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

కల్లూరు, న్యూస్‌టుడే: పేరువంచ గ్రామానికి చెందిన ఆసంది కృష్ణమ్మ(72) నీళ్లు కాగబెడుతుండగా కోతులు రావటంతో కంగారులో పరుగెత్తిన క్రమంలో చీరకు మంటలంటుకున్నాయి. విషయం గమనించకపోవటంతో శరీరం కాలిపోవటంతో ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కృష్ణమ్మ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందారు. ఎస్సై షాకీర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయి పట్టివేత

పెనుబల్లి, న్యూస్‌టుడే: తుమ్మలపల్లి గ్రామ సమీపంలో శనివారం బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు యువకులను ఆబ్కారీ అధికారులు పట్టుకున్నారు. వారి నుంచి అయిదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ యువకులను ఏపీలోని బాపట్లకు చెందిన ఆనంద్, గుంటూరుకు చెందిన ఏసుగా గుర్తించి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రవీణ్ రెడ్డి, ఎస్సై ఆర్.కిషన్ పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

చింతకాని, న్యూస్‌టుడే: రామకృష్ణాపురానికి చెందిన కన్నెబోయిన ఉపేందర్‌కు పందిళ్లపల్లిలో కోళ్లఫాం ఉంది. శనివారం వివాదం చోటుచేసుకున్న క్రమంలో కన్నెబోయిన అంజయ్య, శ్రీను, శ్రీనివాస్, సాయికిరణ్ అనే నలుగురు సీసీ కెమెరాలు ధ్వంసం చేయటంతో పాటు కోళ్లను బయటకు వదిలిపెట్టారు. రూ. 60 వేల నష్టం వాటిల్లిందని ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

పులిగుట్ట ఆలయంలో చోరీ

వైరా, న్యూస్‌టుడే: గొల్లపూడి పులిగుట్ట ఆలయంలోని రెండు సీసీ కెమెరాల హార్డ్‌డిస్కులు శనివారం చోరీ అయ్యాయి. ఈవో ప్రసాద్ ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'రేబిస్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి'


అవగాహన కల్పిస్తున్న అధికారి వేణుమనోహర్‌రావు

చింతకాని, న్యూస్‌టుడే: ప్రపంచాన్ని భయభ్రాంతులకు గురిచేసే రేబిస్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణుమనోహర్‌రావు సూచించారు. ప్రపంచ రేబిస్ దినం సందర్భంగా నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ నవీన్‌బాబు, మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రాంజీ, నాగులవంచ వైద్యాధికారి శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ వింజం కృష్ణార్జునరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆందోళన

బోనకల్లు, న్యూస్‌టుడే: అసంబద్ధ రేషనలైజేషన్ ఉత్తర్వులను ఉపసంహరించాలని కోరుతూ శనివారం ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేశారు. యూటీఎఫ్ నాయకులు రామకృష్ణ, మహేశ్‌కుమార్, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులతోనే సమస్యల పరిష్కారం: నున్నా

చింతకాని, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. పాతర్లపాడులో నిర్వహించిన సీపీఎం మహాసభలో శనివారం పాల్గొన్నారు. పాతర్లపాడు గ్రామ శాఖ కార్యదర్శిగా కాటబత్తిని వీరబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టీపీటీఎఫ్ సమావేశం

కారేపల్లి, న్యూస్‌టుడే: టీపీటీఎఫ్ మండల సర్వసభ్య సమావేశం టి. వెంగళరావు, పద్మ ఆధ్వర్యంలో కారేపల్లిలో శనివారం నిర్వహించారు. మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బ్రహ్మళకుంటలో కార్డన్ సెర్చ్

పెనుబల్లి, న్యూస్‌టుడే: బ్రహ్మళకుంటలో 150మంది పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకుని వీఎం బంజర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఖమ్మం డీసీపీ నరేశ్, కల్లూరు ఏసీపీ రఘు, సత్తుపల్లి సీఐ కిరణ్, ఎస్సై వెంకటేశ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మధిర, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం మండల పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిశోర్ చేతులమీదుగా అందజేశారు.

'ఆర్వోబీ మరమ్మతులకు రూ.70 లక్షలు'

మధిర పట్టణంలోని ఆర్వోబీ మరమ్మతుల కోసం రూ. 70 లక్షలు నిధులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంజూరు చేసినట్టు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిశోర్, పట్టణ అధ్యక్షుడు ఎంపీ రమణగుప్తా తెలిపారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం వెల్లడించారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

వైరా, న్యూస్‌టుడే: వైరా మున్సిపాలిటీ పరిధిలో ఎన్నెస్పీ కాలువపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను శనివారం అధికారులు కూల్చివేశారు. శాంతి నగర్ సమీపంలో నిర్మించిన ఓ ఇంటిని జేసీబీతో కూల్చివేశారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

వైరా, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల విద్యా శాఖ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రశస్థ యాప్‌లో ఓరియంటేషన్ శిక్షణ శనివారం నిర్వహించారు. యాప్ విధివిధానాలపై ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ కార్యక్రమానికి సీఎంఓ రాజశేఖర్ హాజరై సూచనలందించారు.

ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించాలి

కొణిజర్ల, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించేందుకు కృషి చేయాలని మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివరావు తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం రెండు రోజు శిక్షణకు హాజరైన మాట్లాడారు. ఈఈ పుష్పలత, డీఈ శ్రీనివాసరావు, ఎంపీడీఓ రోజా రాణి, ఎంపీఓ రాజేశ్వరి, ఏఈ సతీశ్ పాల్గొన్నారు.

తిరుమల లడ్డూలో కల్తీని నిరసిస్తూ ప్రదర్శన



పెనుబల్లి, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ వీఎం బంజర్‌లో శనివారం హిందూ ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. కాషాయి జెండాలను చేబూని స్థానిక శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయం నుంచి పెనుబల్లి రామాలయం వరకు ప్రదర్శనగా వెళ్లారు.

పుస్తకాలు చదవాలి

తల్లాడ: విద్యార్థులు విజ్ఞాన, వినోద, సాహిత్య పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పొందాలని ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యుడు కట్టా సత్యప్రసాద్ అన్నారు. శనివారం కుర్నవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సాహిత్యానికి చెందిన 100పుస్తకాలను అందజేశారు. హెచ్ఎం ఝాన్సీరాణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం: ఎమ్మెల్యే


తల్లాడ: గర్భిణులకు సీమంతం చేస్తున్న రాగమయి

తల్లాడ, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందుతోందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. శనివారం తల్లాడ ఆర్‌బీ గార్డెన్‌లో ఐసీడీఎస్ సీడీపీవో ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం, సీమంతం వేడుకలను నిర్వహించారు. 45మందికి సీమంతం, 21మంది చిన్నారులకు అక్షరాభ్యాసం, 15మంది చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. సీడీపీవో జ్యోతి, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ శ్రీదేవి, ఉప తహసీల్దార్ వనజ, ఎస్సై కొండలరావు, ఈవో కృష్ణారావు, వైద్యాధికారి నీలిమ పాల్గొన్నారు.

★ సిరిపురం మేజర్ కాలువకు 150 క్యూసెక్కులకుపైగా సాగునీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే మట్టా రాగమయికి మండల కాంగ్రెస్ నాయకుడు దుండేటి వీరారెడ్డి విజ్ఞప్తి చేశారు.

పెనుబల్లి, న్యూస్‌టుడే: చదువే జీవిత స్థిరాస్తి అని, నచ్చిన రంగంలో స్థిరపడి కన్నవారికి, కళాశాలకు, ప్రాంతానికి మంచి పేరు తేవాలని సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి సూచించారు. పెనుబల్లి జూనియర్ కళాశాలలో శనివారం స్వాగత వేడుకకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీడీవో అన్నపూర్ణ, ఎంఈవో సత్యనారాయణ, ప్రిన్సిపల్ అనిత పాల్గొన్నారు.

సాయుధ పోరాట శౌర్యయాత్ర

వైరా, న్యూస్‌టుడే: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రపై ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన శౌర్యయాత్ర శనివారం మండలానికి చేరుకుంది. గండగలపాడు, విప్పలమడక, వైరా, ఖానాపురం గ్రామాల్లో వీధి నాటికలు ప్రదర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, తెలంగాణ రైతుసంఘం జిల్లాకార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడారు. వైరా మండలం వల్లాపురం, ఖానాపురం, గండలపాడు, విప్పలమడక, గొల్లనపాడు గ్రామాల్లో అమరుల స్తూపాలకు నివాళి అర్పించారు. ప్రజానాట్య మండలి అధ్యక్షుడు ఆనంద్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సదానంద్, తోట నాగేశ్వరరావు, బొంతు సమత, మణి, రామారావు తదితరులు పాల్గొన్నారు.


నాటికను ప్రదర్శిస్తున్న ప్రజానాట్య మండలి కళాకారులు

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక


బాణాపురం పాఠశాల విద్యార్థులతో పీడీ శ్రీనివాస్

ముదిగొండ, న్యూస్‌టుడే: మండలంలోని బాణాపురం, వల్లభి, మేడేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కూసుమంచి జోనల్ స్థాయి కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో అండర్-14, అండర్-17 విభాగాల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాణాపురం నుంచి 16, వల్లభి నుంచి ముగ్గురు, మేడేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఆరుగురు ఎంపికయ్యారు. శనివారం విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, శోభ, నాగేశ్వరరావు, పీడీలు శ్రీనివాస్, దేవి, శ్రీనివాస్‌రావు అభినందించారు.

కబడ్డీలో మెరికలు..: చింతకాని, న్యూస్‌టుడే: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం జోనల్ స్థాయి పోటీల్లో నేరడ ఉన్నత పాఠశాలకు చెందిన అర్పణ, ఆశ, సువర్ణలు బాలికల అండర్-17 కబడ్డీ విభాగంలో ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. బాలుర అండర్-17లో ప్రవీణ్, అండర్-14లో ఆకాశ్, గోపీలు జిల్లా జట్లకు ఎంపికయ్యారు.

వైరా, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడల్లో న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మండల, జోనల్ స్థాయిలో అండర్-14, 17 బాలికలు, బాలుర విభాగాల్లో ప్రతిభ చాటారు. విద్యార్థులు పాఠశాల కరస్పాండెంట్ పి.భూమేష్ రావు, కుర్రా సుమన్ అభినందించారు.

జోనల్ క్రీడల్లో హవా: పెనుబల్లి, న్యూస్‌టుడే: కుప్పెనకుంట్లలోని ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్ కుంచపర్తి విద్యార్థులు జోనల్ క్రీడల్లో పలు బహుమతులు గెల్చుకున్నారని ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. 800, 400, 600 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్‌తోపాటు పలు అథ్లెటిక్స్ పోటీల్లో మొదటి, రెండో స్థానాలు సాధించారు. ఖోఖో, వాలీబాల్, కబడ్డీలో మొదటి, రెండో స్థానాలు దక్కించుకున్నారు. విజేతలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్‌సీవో బ్యూలారాణి బహుమతులందించారు.

కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం


వైరా: భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

వైరా, న్యూస్‌టుడే: భగత్‌సింగ్ జయంతి సందర్భంగా డీవైఎఫ్ఐ, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. వైరాలోని బోడేపూడి భవనంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి నాగుల్‌మీరా అధ్యక్షతన జరిగిన సభలో తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడారు. మురళీ, తోట నాగేశ్వరరావు, నరసింహారావు, పాషా తదితరులు పాల్గొన్నారు.

మధిర, న్యూస్‌టుడే: బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి స్వాతంత్ర్య సంగ్రామంలో యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన విప్లవ వీరుడు భగత్ సింగ్ అని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ పేర్కొన్నారు. మధిరలో భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు అయ్యప్ప, క్రాంతి, సాయిమణికంఠ, గోపి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కొణిజర్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రంగారావు డిమాండ్ చేశారు. కొణిజర్లలో సంఘం మండల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేశ్, ప్రధాన కార్యదర్శిగా సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా సంజీవరెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరావు, జయకృష్ణ, ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో అబ్రహం, బ్రహ్మారెడ్డి, విజయ్ అమృత కుమార్ పాల్గొన్నారు.


మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్, సూర్యనారాయణ

రూ.లక్ష చెక్కు అందజేత

ముదిగొండ, న్యూస్‌టుడే: బాణాపురానికి చెందిన ఉపాధ్యాయుడు వట్టికూటి రమేశ్‌బాబు ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఆయన దశదిన కర్మకు పీఆర్టీయూ ప్రతినిధులు, ఉపాధ్యాయులు శనివారం హాజరై రమేశ్‌బాబు చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడి కుమార్తె స్ఫూర్తికి రూ. లక్ష చెక్కును సంఘం జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు అందజేశారు. ముదిగొండ, నేలకొండపల్లి మండలాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు రత్నకుమార్, బంకా గురవయ్య, మాధవరావు, సత్యనారాయణ, విజయ్ పాల్గొన్నారు.


ఉపాధ్యాయుని కుమార్తెకు చెక్కు అందజేస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు

గుండెపోటుతో టెక్నికల్ అసిస్టెంట్ మృతి


నాగేశ్వరరావు

మధిర పట్టణం, ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మందా నాగేశ్వరరావు (45) శనివారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. ఈయన ఎర్రుపాలెం మండలం పెద్దగోపవరం నివాసి. ఉదయం ఇంటి వద్ద ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పటంతో కుటుంబ సభ్యులు మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏపీడీ వెంకటరాజు, ఏపీఓ నాగరాజు, ఈసీ విజయ్, సిబ్బంది సందర్శించి సంతాపం తెలిపారు.

ఆదర్శం.. 'నాగులవంచ'

చింతకాని, న్యూస్‌టుడే: వంద శాతం పంట రుణాల వసూలుతోపాటు తిరిగి రుణాలు అందించి ఆదర్శంగా నిలిచింది నాగులవంచ సహకార సంఘం. ఎనిమిది గ్రామాలకు చెందిన 1,162 మంది రైతులు సభ్యులు. వీరు గత ఏడాదికి రూ. 8.43 కోట్ల పంట రుణం పొందారు. ఈ ఏడాది మార్చి 31లోపు చెల్లించి.. తిరిగి పొందారు. వీరిలో 758 మంది రైతులకు ఇటీవల పంట రుణమాఫీ రూ. 4.52 కోట్లు వర్తించటం గమనార్హం. గత ఏడాది ఈ సంఘం రూ. 72.56 లక్షల లాభాలార్జించి చింతకాని డివిజన్‌లో ముందంజలో ఉంది. ఖమ్మం డీసీసీబీలో శనివారం సీఈఓ యాలమూడి శ్రీనివాసరావును డీసీసీబీ ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు సత్కరించారు.


సీఈఓను సత్కరిస్తున్న డీసీసీబీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు

శేషాచల శ్రీనివాసుడి ఆలయానికి విరాళం



పెనుగోలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం మండలంలోని మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి ఆలయానికి ఖమ్మానికి చెందిన నాగుబండి భిక్షం, వెంకటేశ్వరరావు, కిరణ్ తమ తల్లిదండ్రులైన రంగయ్య, లక్ష్మీకాంతం జ్ఞాపకార్థం రూ.51 వేలు విరాళం ఇచ్చినట్లు కమిటీ సభ్యులు కె.నాగేశ్వరరావు శనివారం తెలిపారు.

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

అక్టోబర్ 6న 'కథ 2023' పుస్తకావిష్కరణ

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: జాషువా సాహిత్య వేదిక, ఖమ్మం ఆధ్వర్యంలో 1990 నుంచి ఉత్తమ కథల కథా సాహితి సంకలన పరంపరలో 34వ 'కథ 2023' పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అక్టోబర్ 6న సాయంత్రం 5.30 గంటలకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 80085 52623, 93944 50199
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081

సమస్య: రాపర్తినగర్ బీసీ కాలనీలో వీధి కుక్కల సమస్య అధికంగా ఉంది. పిల్లలు బడికి వెళ్లే సమయంలో వెంట పడుతున్నాయి. **- ఓ పాఠకురాలు**

సమాధానం: వీధి కుక్కల నియంత్రణకు ఇప్పటికే చర్యలు చేపట్టాం. వాటికి శస్త్ర చికిత్సలు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. **- ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే**

బిల్ కలెక్టర్‌ను సస్పెండ్ చేసిన కమిషనర్

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఆస్తిపన్ను నిర్ధారించేందుకు రూ.10 వేలు డిమాండ్ చేసిన బిల్ కలెక్టర్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ కమిషనర్ అభిషేక్ అగస్త్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 25వ డివిజన్‌కు చెందిన ఓ వ్యక్తి తన ఇంటికి ఆస్తిపన్ను వేయాలని దరఖాస్తు చేసుకున్నారు. ఇంటికి కొలతలు తీసుకున్న బిల్ కలెక్టర్ బుర్రి విజయ్‌కుమార్ పన్ను అధికంగా రాకుండా ఉండాలంటే తనకు రూ.10 వేలు ఇవ్వాలని, తద్వారా ప్రతి నెల రూ.వేలాది మిగులుతాయని చెప్పాడు. ఇదే విషయమై బిల్ కలెక్టర్ సదరు యజమానికి పలుమార్లు ఫోన్ చేయడంతో ఆయన కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుతోపాటు దానికి సంబంధించిన సాక్ష్యం కావాలని కోరడంతో చరవాణికి ఫోన్ చేసిన సమయంలో విజయ్‌కుమార్ మాటలు రికార్డు చేసి కమిషనర్‌కు వినిపించారు. దీంతో స్పందించిన కమిషనర్ ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు.

రేషనలైజేషన్ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలి

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: అసంబద్ధ రేషనలైజేషన్ ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయ పోరాట సమితి(యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట శనివారం పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. యూఎస్‌పీసీ నాయకులు పి.నాగిరెడ్డి, పారుపల్లి నాగేశ్వరరావు, ఎస్.విజయ్‌లు మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం పాత ప్రభుత్వ దారిలోనే పయనిస్తోందని విమర్శించారు. నాయకులు ఏవీ నాగేశ్వరరావు, రంజాన్, రాంబాబు, యాదగిరి, మన్సూర్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

చేతన ఫౌండేషన్‌కు అవార్డు

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు సాంస్కృతిక విభాగం గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా సామాజిక సేవారంగంలో విస్తృతంగా సేవలు అందిస్తున్న చేతన ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు వెనిగళ్ళ రవికుమార్‌కు ఎక్సలెన్స్ అవార్డును అందజేశారు. వాషింగ్టన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అవార్డును ఏపీ ఎమ్మెల్యే దూదిపాళ్ల నరేంద్రకుమార్ అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు కల్చరల్ అధ్యక్షులు కృష్ణ లామ్ పాల్గొన్నారు.

వనిత వ్యాపార ఘనత

తరుణి

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ప్రభుత్వ చేయూత అందుకొని వారు విజయపథంలో దూసుకెళ్తున్నారు. రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపారాల్లో రాణిస్తున్నారు. చిరు వ్యాపారాలు ప్రారంభించి లాభాల బాటలో పయనిస్తున్నారు. మిగతా మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. నగరానికి చెందిన కొంతమంది మహిళలు 'మహిళా శక్తి' పథకంతో వ్యాపారాభివృద్ధి చేసుకుంటున్నారు. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటి వరకు రూ.60.40 లక్షలతో 56 మందికి వ్యక్తిగత, ఒక గ్రూపునకు రుణాలు మంజూరు చేశారు.

మహిళలు గతంలో వ్యాపారాలు చేయాలనుకుంటే వడ్డీ వ్యాపారులను ఆశ్రయించేవారు. అధిక వడ్డీలు, దినసరి వడ్డీ(డెయిలీ ఫైనాన్స్)లు తడిసి మోపెడయ్యేవి. ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సుదీర్ఘ కాలంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిలో అర్హులైన వారికి ప్రభుత్వం రుణాలు అందించడం ఉపయుక్తంగా మారింది. స్వయం సహాయక సంఘాల్లో ఉంటూ ఉపాధి ఏర్పాటు చేసుకున్న వారు 'మహిళా శక్తి'కి ఎంపిక కావడంతో ఆర్థిక చేయూత లభించింది. సీవోలు, ఆర్పీల సమన్వయంతో అర్హులైన వారిని ఎంపిక చేశారు. ఎంపికైనా వారు పండ్ల వ్యాపారం, బేకరీ, పాల ఉత్పత్తులు, మైక్‌సెట్, బ్యూటీపార్లర్, టెంట్‌హౌజ్, ఫ్యాన్సీ స్టోర్స్, కిరాణా అండ్ జనరల్ స్టోర్స్, ఆహార వాహనాలు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు, మట్టి పాత్రలు, కూరగాయలు, బ్యాగుల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.



సుదీర్ఘకాలంగా మట్టితో వివిధ రకాల వస్తువులు తయారు చేసి విక్రయిస్తున్నాం. పెట్టుబడి కోసం రుణాలు తీసుకున్నాం. ప్రస్తుతం మంజూరైన రూ.5 లక్షల రుణంతో అప్పులు తీర్చుకోవడంతో పాటు వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకున్నాం.
- పుష్ప, మట్టిపాత్రల వ్యాపారం, ఇల్లెందు రోడ్డు

సంచుల వ్యాపారంతో ఉపాధి: ఫరా, కస్బాబజార్

ఐదేళ్లుగా సంచుల వ్యాపారం చేస్తున్నాం. పెట్టుబడి కోసం ప్రైవేటుగా అప్పులు తెచ్చుకొని ప్రారంభించాం. ప్రస్తుతం మహిళా శక్తి రుణం మంజూరు కావడంతో కొంత ఉపశమనం కలిగింది. రూ.2 లక్షలు రుణం లభించింది. ఈ మొత్తంతో కొత్త సరకు తెచ్చుకోవడంతోపాటు, చిన్నచిన్న అప్పులు తీర్చుకునే అవకాశం దక్కింది.



కొత్త యంత్రాల కొనుగోలుకు అవకాశం

భాగ్యమ్మ, చీరల రోలింగ్ యూనిట్, పంపింగ్ వెల్ రోడ్

కొన్నేళ్లుగా శారీ రోలింగ్, టైలరింగ్ నిర్వహిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నాం. ప్రస్తుతం ఇందిరా మహిళా శక్తి రుణం మంజూరైంది. రుణం అందగానే మరో యంత్రం కొనుగోలు చేసి మరికొందరికి ఉపాధి కల్పిస్తా.





భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

యువతకు స్ఫూర్తి భగత్‌సింగ్

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: భగత్‌సింగ్ నేటి యువతకు స్ఫూర్తిదాయకమని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో శనివారం భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ జానిమియా, శింగు నర్సింహారావు, సిద్దినేని కర్ణకుమార్, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

పులిగుండాలలో పర్యటన

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థినులను జిల్లా పర్యాటకశాఖ పులిగుండాల విహార యాత్రకు తీసుకెళ్లింది. శనివారం కళాశాలలో ఏర్పాటైన కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ విహార యాత్రలోని విద్యార్థినులకు శుభాకాంక్షలు చెప్పి పంపించారు. ప్రతీ విద్యార్థిని యాత్రపై ఓ నివేదిక తయారు చేయాలని కోరారు. బస్సులో కనకగిరిగుట్టలోని పులిగుండాల అటవీ ప్రాంతాలను సందర్శించారు. వారితో పాటు పర్యాటక అధికారి సుమన్ చక్రవర్తి, ప్రిన్సిపల్ పద్మావతి, అధికారులు వేణుమనోహర్, ఎన్ఎస్ఎస్ బాధ్యులు ఉన్నారు.

'ఎర్రజెండాతోనే ప్రజా సమస్యలకు పరిష్కారం'

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే ఎర్రజెండా బాట పట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం కొత్తగూడెంలోని ఎర్రబోయిన లింగయ్య భవన్‌లో శనివారం సీపీఎం ఖమ్మం అర్బన్ మండల శాఖ మహాసభలు ప్రారంభమయ్యాయి. తొలుత సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపేందర్ అధ్యక్షతన జరిగిన సభలో నున్నా మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, అర్బన్ నాయకులు షేక్ మీరాసాహెబ్, బత్తిని ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ నూతన కార్యవర్గం

కూసుమంచి, న్యూస్‌టుడే: పీఆర్టీయూ మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక కూసుమంచిలో శనివారం నిర్వహించారు. మండల కమిటీ అధ్యక్షుడిగా పి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఆంజనేయులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రంగారావు, జిల్లా బాధ్యులు శేఖర్, జయమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లి, న్యూస్‌టుడే: పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా పి.రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యాలయంలో నూతన కమిటీని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా వెంకన్న, ఉపాధ్యక్షురాలిగా డి.మాలిక, ఉపాధ్యక్షునిగా కళా శశిధర్, కార్యదర్శులుగా రవి, పవన్, మానియా, విజయలక్ష్మిని ఎన్నుకున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌ను మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్ కలిసి నగర ట్రాఫిక్ సమస్యపై శనివారం చర్చించారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించే అంశంపై వివరించారు.

కార్మికుల వేతనాలు పెంచాలి

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న ఒప్పంద, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు బి.మధు, కల్యాణం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట శనివారం కార్మికులు ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు టి.విష్ణు, నాయకులు రమ్య, తిరుమలాచారి, ఉపేందర్, శ్రీను, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల కోసం పోరాటం: ఐద్వా

ఖమ్మం మామిళ్లగూడెం: మహిళల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు నిర్వహించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మాచర్ల భారతి పిలుపునిచ్చారు. ఐద్వా రెండో పట్టణ కమిటీ మహాసభ నగరంలోని రమణగుట్టలో శనివారం నందిపాటి పావని అధ్యక్షతన నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా నందిపాటి పావని, నకరికంటి కుమారి, 18 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

డీఎస్సీ అభ్యర్థుల నిరసన

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: తమకు న్యాయం చేయాలని కోరుతూ 2008 ఏజెన్సీ ప్రాంత డీఎస్సీ అభ్యర్థులు శనివారం ఖమ్మంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట బైఠాయించారు. కామన్ మెరిట్‌లో 67 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు తెలిపారు. తాజాగా ప్రకటించిన జాబితాలో తమ పేర్లు లేవని, ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు



ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలోని ఏఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, శాంతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఆర్.గోవిందరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. హెచ్ఐవీ వ్యాధిపై యువత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాపించే మార్గాలు, లక్షణాలు, నివారణ చర్యల గురించి ఐసీటీసీ కౌన్సెలర్ జి.రంగారావు వివరించారు. జనవాహిని ప్రాజెక్టు మేనేజర్ సుందరరావు, హెచ్ఐవీ పరీక్ష ఆవశ్యకత గురించి వివరించారు.

వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ



ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలోని వరద బాధితులకు ఎస్‌బీఐటీ కళాశాల, ఎన్ఆర్ఐ సంస్థ 'ఆప్టా' అండగా నిలిచాయి. నయాబజారు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం 300 మంది విద్యార్థులకు దుప్పట్లు, పుస్తకాలను ఎస్‌బీఐటీ ఛైర్మన్ గుండాల కృష్ణ పంపిణీ చేశారు. సెక్రటరీ, కరస్పాండెంట్ గుండాల ధాత్రి, ప్రిన్సిపల్ రాజ్‌కుమార్, 'ఆప్టా' అధ్యక్షుడు త్రినాథ్ ముదిగొండ, గ్లోబల్ ఆపరేటర్ ఛైర్మన్ మధు పులి, ఖమ్మం ఇన్‌ఛార్జి కార్తీక్ గుండాల, వైస్ ప్రిన్సిపల్ అమిత్ బిందాజ్, పాఠశాల హెచ్ఎం సుధారాణి అకడమిక్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు కలెక్టర్ నివాళి



→ జాషువా చిత్రపటం వద్ద కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కనే ప్రిన్సిపల్ పద్మావతి తదితరులు →

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. జాషువా చిత్రపటానికి.. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పూలమాల వేశారు. కళాశాల ప్రిన్సిపల్ జి.పద్మావతి, వైస్ ప్రిన్సిపల్ రామారావు, అధ్యాపకులు ప్రవీణ్‌కుమార్, శ్యామలాదేవి, రామ్‌కుమార్, రామారావు పాల్గొన్నారు.

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: జాషువా జయంతిని తెలంగాణ సామాజిక ఉద్యమకారుల ఫోరం కార్యాలయంలో శనివారం నిర్వహించారు. పొట్ట చంద్రశేఖరరావు, సురేశ్, ఆంజనేయులు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, సంగమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుల నిర్మూలనకు పోరాడదాం

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: కుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పోరాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు కె.శ్రీనివాస్ తెలిపారు. జ్యోతిబాపులే స్థాపించిన సత్యశోధక సంస్థ ఏర్పడి 151 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం మాస్‌లైన్ ఖమ్మం నగర కమిటీ ఆధ్వర్యంలో ఐదో డివిజన్‌లో ర్యాలీ నిర్వహించారు.

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: రాజీవ్ గృహకల్పలో శనివారం సత్యశోధక సంస్థ ఏర్పాటు సమావేశం నిర్వహించారు. సీపీఐ ఎం.ఎల్. మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ పాల్గొన్నారు.

జ్వరాల బారిన విద్యార్థులు

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: గొల్లగూడెంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. రోజుకు ఒకరిద్దరు అస్వస్థతకు గురవుతూ వసతి గృహంలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. శనివారం పాఠశాలలో 6వ తరగతి విద్యార్థిని జ్వరంతో బాధపడుతుంటే సమయానికి వార్డెన్, ఏఎన్ఎం అందుబాటులో లేరు. వార్డెన్ రమాకుమారిని వివరణ కోరగా.. అప్పుడే బయటకు వెళ్లానని, ఏఎన్ఎం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిందని వివరించారు. తిరుమలాయపాలెంలో చికిత్స చేయించినట్లు వివరించారు.

రిమాండ్‌కు తరలింపు

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: పాత బస్టాండ్ ప్రాంతంలో ఈనెల 25న డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఎస్సై విధులకు ఆటంకం కలిగించిన కరుగుంట్ల శ్రీనును శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సదరు వ్యక్తిపై టూటౌన్‌లో 312 బీఎన్ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రాగి తీగ చోరీ

కూసుమంచి, న్యూస్‌టుడే: హట్యాతండా వద్ద వ్యవసాయ క్షేత్రంలోని 25 కేవీ విద్యుత్తు నియంత్రికను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని రాగి తీగను దొంగిలించిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. శనివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏడీఈ కోక్యానాయక్ తెలిపారు.

వీధి కుక్కల దాడులపై నియంత్రణ చర్యలు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: వీధి కుక్కల దాడులపై నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. లూయీపాశ్చర్ మరణించిన రోజున ప్రపంచ రేబిస్ దినోత్సవం నిర్వహించుకుంటున్నామని తెలిపారు. హాస్టల్‌లో భోజన, వసతి సరిగా లేదని ఎస్సీ హాస్టల్ విద్యార్థినులు తెలుపగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణు మనోహర్, కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి పాల్గొన్నారు.

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: రేబిస్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ జేడీ బి.వేణుమనోహర్ అన్నారు. పాకబండబజారులోని పశువైద్యశాలలో శనివారం అవగాహన కల్పించారు. జిల్లా అగ్నిమాపక అధికారి అజయ్, పశుసంవర్ధకశాఖ ఏడీలు శ్రీరమణి, అరుణ, పశువైద్యులు క్రాంతికుమార్, రాజు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: పిండిప్రోలులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం పశువైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పశువైద్యులు అనూష, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది జానీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ బి.వేణుమనోహర్

విశ్రాంత ఉద్యోగుల వితరణ

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఖమ్మం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం నగర మేయర్ పునుకొల్లు నీరజ చేతుల మీదుగా వరద బాధితులకు రూ.40 వేలు విలువైన నిత్యావసరాలను పంపిణీ చేశారు.



వరద బాధితులకు నిత్యావసర వస్తువులు అందిస్తున్న మేయర్ నీరజ, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరకుల కిట్లను వితరణగా అందజేశారు.

టెక్-మహీంద్రా సాంత్వన

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: రాకాసితండలో టెక్ మహీంద్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వరద బాధితులకు దుప్పట్లు, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. బొక్కలగడ్డ, గోపాలపురం ప్రాంతాల్లో సరకులందించారు. రూ.4.5 లక్షల నిత్యావసరాలు అందించినట్లు ఫౌండేషన్ సిబ్బంది శ్రీనివాసరావు తదితరులు తెలిపారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న టెక్ మహీంద్రా సిబ్బంది

నగరంలో సినిమాలు..	శ్రీనివాస: సత్యం సుందరం కేపీఎస్: మత్తు వదలరా-2
శ్రీసాయిరాం, వినోద, శ్రీ తిరుమల: దేవర పార్ట్-1	



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

ఉద్యమాలతోనే విద్యా రంగ సమస్యల పరిష్కారం

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాల బలోపేతంతోనే విద్యారంగ సమస్యలు పరిష్కారం అవుతాయని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఆవుల అశోక్ పేర్కొన్నారు. పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభ ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో శనివారం నిర్వహించారు. తొలుత పెవిలియన్ మైదానం నుంచి మయూరి సెంటర్ వరకు విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అశోక్ మాట్లాడుతూ. . కోట్లాది పేద బిడ్డలకు నాణ్యమైన, సమానమైన, శాస్త్రీయమైన విద్యా సాధన కోసం ఉస్మానియా గడ్డ మీద జార్జిరెడ్డి పీడీఎస్‌ను స్థాపించారని తెలిపారు. మతోన్మాద ప్రమాదాన్ని గుర్తించి ప్రాథమికంగా అడ్డుకునేందుకు పోరాడి ప్రాణాలర్పించారన్నారు. 50 వసంతాలుగా పీడీఎస్‌యూ సమసమాజ స్థాపన, విద్యార్థుల సౌకర్యాలు, హక్కుల కోసం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ కార్యదర్శి పుల్లయ్య, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు సంధ్య, శరత్, రాష్ట్ర కోశాధికారి సురేశ్, మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సీ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటేశ్, నాయకులు శ్రీకాంత్, వినయ్, శ్రీను, యశ్వంత్, వెంకటేశ్, సందీప్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

'డ్రైరన్' పరీక్షకు మోటారు సిద్ధం

కూసుమంచి, న్యూస్‌టుడే: నీట మునిగిన భక్త రామదాసు ఎత్తిపోతల పథకం మోటారు డ్రై రన్‌కు సిద్ధమైంది. రెండు రోజుల్లో పరీక్షించేందుకు ఇంజినీర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. 1న పాలేరు జలాశయానికి వరద పోటెత్తిన నేపథ్యంలో వెనక భాగాన ఉన్న భక్తరామదాసు ఎత్తిపోతల పథకాన్ని నీరు చుట్టుముట్టింది. పంప్‌హౌస్‌లోకి నీరు చేరడంతో రెండు భారీ మోటార్లు నీట మునిగాయి. ప్యానల్ బోర్డుల్లో ఒక మీటరు వరకు నీరు చేరింది. వైర్లు నానిపోయాయి. 20 రోజులుగా డీఈఈ రమేశ్‌రెడ్డి, ఏఈ ఆయేషా, సిబ్బంది తడిచిన అన్నింటిని డ్రై (వేడి) చేశారు. అవసరమైన మరమ్మతులు చేపట్టారు. 2,500 అశ్వకశక్తి కలిగి 250 క్యూసెక్కుల నీటిని తోడగలిగే సామర్థ్యమున్న రెండు మోటార్లల్లో ఒకటి సిద్ధం చేశారు. సోమవారం డ్రైరన్ నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టారు. రెండు మూడు రోజులు నడిపి ఎలాంటి అవరోధాలు లేకుంటే నీటిని తోడుతామని డీఈఈ రమేశ్‌రెడ్డి చెప్పారు.



నీట మునిగిన మోటారును డ్రై రన్‌కు సిద్ధం చేస్తున్న ఇంజినీర్లు, సిబ్బంది

పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు: అదనపు కలెక్టర్

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: జిల్లాలో రైతుల నుంచి పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 15 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని, మధిర, ఖమ్మం, నేలకొండపల్లి, వైరా, మద్దులపల్లిలో సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈ ఏడాది 17.97 లక్షల క్వింటాళ్ల పత్తి మార్కెట్‌కు వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు.

మంత్రి సమావేశానికి తహసీల్దార్లు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం నల్సార్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే తహసీల్దార్ల సమావేశానికి జిల్లా తహసీల్దార్లు హాజరు కానున్నారు. కొత్త రెవెన్యూ చట్టం, రెవెన్యూ సమస్యలపై సమావేశంలో చర్చించనున్నారు.

తల్లి స్మారకార్థం వైద్య శిబిరం

కూసుమంచి, న్యూస్‌టుడే: తల్లి స్మారకార్థం తమ గిరిజన తండాలో వైద్యశిబిరాన్ని నిర్వహించి ఉచితంగా ఔషధాలను పంపిణీ చేశారు. ఎర్రగడ్డతండాకు చెందిన బానోతు హట్య, శ్రీను సోదరులు.. తమ తల్లి బుచ్చమ్మ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ వైద్యుల సాయంతో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎర్రగడ్డతండాతోపాటు, దుబ్బతండా, కొత్తూరు, గోపతండా నుంచి వందలాది మంది వైద్య సేవలు పొందారు. రూ.5 లక్షల విలువైన ఔషధాలు పంపిణీ చేశారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా! శ్రీ దోమాల శేఖర్, తండ్రి: జీవయ్య, నివాసం: ఇ.నెం.5-4-90/బి/1, పార్శిబంధం, ఖమ్మం అనువారు దిగువ అనుసూచిలో విపులీకరించిన స్థిరాస్తిని శ్రీమతి పసుపులేటి సత్యవతి, భర్త: సత్యనారాయణ, నివాసం: పాకబండ, ఖమ్మం గారి నుండి రిజిస్టర్డ్ క్రయదస్తావేజు నెం.4970/2022 తేది: 12-04-2022, O/o జాయింటు సబ్ రిజిస్ట్రార్, ఖమ్మం ద్వారా క్రయం పొంది, సంపూర్ణ, స్వాధీన, యాజమాన్య హక్కు భుక్తములతో అనుభవించుచుండిరి. తదుపరి ది.12-01-2023న శ్రీ దోమాల శేఖర్ గారు అనుసూచి స్థిరాస్తిపై సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఖమ్మం వారి నుండి ఋణసౌకర్యం పొందివుండిరి. ప్రస్తుతం శ్రీ దోమాల శేఖర్‌గారు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, అసెట్ మేనేజ్‌మెంట్‌హబ్, ఖమ్మం (4101) వారిని సంప్రదించి 'సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఖమ్మం వారి నుండి తన ఋణమును "టేక్‌ఓవర్" చేయించుటకు ప్రతిపాదించియున్నారు.

దిగువ అనుసూచి స్థిరాస్తి సంబంధించిన లింకు క్రయ దస్తావేజులలో ఒకటైన అసలు క్రయదస్తావేజు నెం.3954/1988 తేది: 26-05-1988, O/o సబ్‌రిజిస్ట్రార్, ఖమ్మం. ది.03-06-2022న పోయిన కారణంగా శ్రీ దోమాల శేఖర్‌గారు పోలీస్ ఖమ్మం 1టౌన్ వారికి విచారణ దరఖాస్తు చేయగా, వారు విచారించిన పిదప సదరు అసలు క్రయదస్తావేజు నెం.3954/1988 లభించని కారణంగా, ఆ వివరణ తెలుపుతూ, ఒక ధృవపత్రం తేది: 16-07-2022 జారీ చేసియున్నారు. సదరు దస్తావేజు లభ్యతకు సంబంధించిగానీ, ఏమైనా తనఖా, తాకట్టుకు సంబంధించి గానీ, ఇతరత్రా ఏవైనా లావాదేవీలకు సంబంధించి గానీ మరియు దిగువ అనుసూచి స్థిరాస్తిని సదరు పైన తెలిపిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, ఖమ్మం వారికి తనఖాచేయుటకు సంబంధించిగానీ, ఎవ్వరికైనా, ఎటువంటి అభ్యంతర, ఆక్షేపణలు వున్న యెడల నేటి నుండి (07) రోజులలో లిఖిత పూర్వకంగా తగిన ఆధారాలతో తెలియపరచగలరు. గడువు తదుపరి ఎవ్వరికి, ఎటువంటి అభ్యంతర, ఆక్షేపణలు లేవని భావించబడును.

అనుసూచి స్థిరాస్తి: ఖమ్మం రిజిస్ట్రేషన్ జిల్లా, ఖమ్మం సబ్‌రిజిస్ట్రార్ అధికారపరిధిలోని ఖమ్మం అర్బన్ మండల, పాకబండ గ్రామసర్వే నెం: 172 మింజుమలే ప్లాటు నెం.5 ఖాళీస్థల విస్తీర్ణం: 190.83 చ.గ॥లు = 159.55 చ.మీ. ఇందుకు **హద్దులు: తూర్పు:** 30'.0' వెడల్పురోడ్, **పడమర:** ఎన్.ఎస్.కెనాల్, **ఉత్తరం:** పి.కోటేశ్వరరావుగారి స్థలం, **దక్షిణం:** ఎన్.వీరభద్రరావు గారి స్థలం.

సం/- **వై.కోటేశ్వరరావు,** న్యాయవాది, నోటరి. మమతారోడ్, ఖమ్మం. సెల్: 9441084081
తేది: 27-09-2024, ఖమ్మం